సాక్షి
పశ్చిమగోదావరి
బుధవారం। 18। డిసెంబర్। 2024



మీకోసం ఎవరి కోసం?

తణుకు ప్రాంతంలోని పశువధ శాలపై మీ-కోసంలో ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదు. ఎలాంటి దుర్గంధం లేదని అధికారులు క్లీన్‌చిట్ ఇచ్చేశారు. 8లో ▸



పెరుగుతున్న బంగారం బాధితులు

విజయవాడ, నరసాపురం, తాడేపల్లిగూడెంలో బంగారు, వెండి ఆభరణాలు చేసి ఇస్తామని చెప్పి 15 కిలోల బంగారంతో ఒక వ్యక్తి ఉడాయించినట్లు సమాచారం. 8లో ▸



పిండ మార్పిడి సక్సెస్

పిండ మార్పిడితో పోడూరులో ఆవు ఒంగోలు జాతి పెయ్యి దూడకు జన్మనిచ్చింది. ఈ పక్రియ కోసం ఆచంట పశువైద్యాధికారి చేస్తున్న కృషి ఫలించింది. 8లో ▸

న్యూస్‌రీల్

బకాయిలు తక్షణం చెల్లించాలి



జీవీఆర్ ప్రభుత్వ కళాశాల వద్ద ఆందోళన చేస్తున్న ఏఐఎస్‌ఏ నాయకులు

భీమవరం: పెండింగ్‌లోని స్కాలర్‌షిప్స్, ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు తక్షణం విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ మంగళవారం భీమవరంలోని శ్రీగ్రంధి వేంకటేశ్వరరావు(జీవీఆర్) ప్రభుత్వ జూనియర్ కళాశాల కూడలిలో ఆలిండియా స్టూడెంట్స్ అసోసియేషన్ (ఏఐఎస్‌ఏ) ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఐఎస్‌ఏ జిల్లా కార్యదర్శి టి.అప్పలస్వామి మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా స్కాలర్‌షిప్స్, ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు దాదాపు రూ.3,500 కోట్లు ఉన్నాయన్నారు. బకాయిలు విడుదల కాకపోవడం వల్ల ఇంజనీరింగ్, పీజీ, డిప్లమో కోర్సులు పూర్తయిన విద్యార్థులకు సంబంధిత కళాశాల యాజమాన్యాలు సర్టిఫికెట్లు ఇవ్వడం లేదని ఆందోళన వ్యక్తం చేశారు. సర్టిఫికెట్లు లేకపోవడం వల్ల ఉన్నత చదువులు, ఉద్యోగాలకు వెళ్లే పరిస్థితి లేక విద్యార్థులు ఇబ్బందులకు గురవుతున్నారని విమర్శించారు. కార్యక్రమంలో ఏఐఎస్‌ఏ నాయకులు మురళి, బి.దినేష్, వి.భార్గవ్, టి.దేవరాజ్, బి.లక్ష్మి పాల్గొన్నారు.

పరీక్ష పేపర్లు అధికారులే పంపాలి

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): ప్రస్తుతం జరుగుతున్న సెల్ఫ్ అసెస్‌మెంట్ టర్మ్–1 మోడల్ పేపర్ పరీక్షా పత్రాలను పోలీస్ స్టేషన్ల నుంచి ప్రధానోపాధ్యాయులు ప్రతిరోజూ తెచ్చుకొని పరీక్ష పెట్టాలన్న నిర్ణయం సరైనది కాదని పీఆర్‌టీయూ ఏలూరు జిల్లా అధ్యక్షుడు పువ్వుల ఆంజనేయులు, ప్రధాన కార్యదర్శి కేవీవీ సుబ్బారావు ఒక ప్రకటనలో ఆక్షేపించారు. దీని వల్ల 15 నుంచి 20 కిలోమీటర్ల దూరం నుంచి వచ్చి వెళ్ళే ప్రధానోపాధ్యాయులు ఇబ్బందులకు గురవుతున్నారని, ఆయా పరీక్ష పేపర్లకు కూడా భద్రత కొరవడిందన్నారు. విద్యాశాఖాధికారులే సీఆర్‌ఎంటీల ద్వారా తగిన సెక్యూరిటీతో పాఠశాలలకు పరీక్ష పేపర్లు చేర్చేలా చర్యలు తీసుకోవాలని జిల్లా విద్యాశాఖాధికారి వెంకట లక్ష్మమ్మను కోరారు.

పెన్షనర్లకు సన్మానం



భీమవరంలో సూపర్ సీనియర్ పెన్షనర్లను సన్మానిస్తున్న దృశ్యం

భీమవరం: పెన్షనర్ల హక్కులు, డిమాండ్ల సాధన కోసం తన వంతు సహాయ సహకారాలందిస్తానని ఉభయ గోదావరి జిల్లాల టీచర్స్ ఎమ్మెల్సీ బొర్రా గోపీమూర్తి అన్నారు. జాతీయ పెన్షనర్స్ దినోత్సవం సందర్భంగా మంగళవారం ప్రభుత్వ రిటైర్డ్ ఎంప్లాయిస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఎన్ఎస్ఎస్ పాల్ అధ్యక్షతన జరిగిన సభలో ఆయన మాట్లాడారు. అసోసియేషన్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు గాతల జేమ్స్, ఎస్ఎస్ఎన్ రాజు మాట్లాడుతూ 79, 75 సంవత్సరాలకు ఇచ్చే అడిషనల్ క్వాంటం ఆఫ్ పెన్షన్ పునరుద్ధరించాలని, పెండింగ్‌లో ఉన్న డీఏలు వెంటనే మంజూరు చేయాలన్నారు. ఈ సందర్భంగా సూపర్ సీనియర్ పెన్షనర్లను సన్మానించారు. కార్యక్రమంలో యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు విజయరామరాజు, గౌరవాధ్యక్షుడు పట్టాభిరామయ్య తదితరులు పాల్గొన్నారు.

వరి కోతలు వాయిదా వేసుకోవాలి

భీమవరం: వాయుగుండం కారణంగా జిల్లాలో రాబోయే రెండు రోజుల్లో విస్తారంగా వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున వరి కోతలు వాయిదా వేసుకోవాలని జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్‌రెడ్డి సూచించారు. జిల్లాలో 2.05 లక్షల ఎకరాల్లో వరి సాగు చేస్తుండగా ఇంతవరకు 1,76,000 ఎకరాల్లో కోతలు పూర్తయ్యాయని తెలిపారు. కళ్లాల్లో ధాన్యాన్ని సురక్షితమైన ప్రాంతానికి తరలించుకోవాలని, వీలుకాని పక్షంలో సంబంధిత రైతు సేవా కేంద్రం ద్వారా కనీస మద్దతు ధరపై తేమ శాతానికి అనుగుణంగా ధాన్యాన్ని అమ్ముకోవడానికి వీలు కల్పించామన్నారు. కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన కంట్రోల్ రూమ్ 8121676653, 18004251291 నంబర్లకు కాల్ చేసి సందేహాలు నివృత్తి చేసుకోవచ్చని తెలిపారు.

20న విజిలెన్స్ కమిటీ సమావేశం

భీమవరం: జిల్లా విజిలెన్స్ కమిటీ సమావేశం ఈ నెల 20న ఏర్పాటు చేసినట్లు జిల్లా పౌరసరఫరాల అధికారి ఎన్.సరోజ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. శుక్రవారం మధ్యాహ్నం కలెక్టరేట్‌లో జరుగుతుందని తెలిపారు.



పందెంకోళ్లు.. సై పోలీసులూ



ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలో పందెం కోళ్లు కూటమి నేతలకు కాసులు కురిపిస్తున్నాయి. సంక్రాంతి మూడు రోజులూ సంప్రదాయంగా నిర్వహించే ఈ కోడిపందేలు, గత 20 రోజుల నుంచి ఈ రెండు జిల్లాల్లో యథేచ్ఛగా సాగుతున్నా.. అడ్డుకట్ట వేయాల్సిన పోలీసులు చోద్యం చూస్తున్నారు. కూటమి ప్రజా ప్రతినిధులు ఈ కోడి పందేలకు రింగ్ లీడర్లు కావడంతో పోలీసులు చేష్టలుడిగి చూస్తున్నారు. రూ. 5 లక్షల నుంచి కోట్లలో పందేలు చేతులు మారుతుండగా.. ఇది వ్యసనంగా మారిన అనేకమంది డబ్బులు పోగొట్టుకుని బికారుల్లా మారుతున్నారు.

సాక్షి ప్రతినిధి, ఏలూరు

వారానికి మూడు చోట్ల కోడి పందేలు.. ముందుగానే పందెంరాయుళ్లకు ఫోన్‌లో లొకేషన్ సమాచారం..

స్థానిక పోలీసులతో ముందుగానే మాటామంతీ... ఎమ్మెల్యేల కార్యాలయం నుంచి ప్రత్యేక ఆదేశాలు..

కూటమి ప్రజాప్రతినిధులే రింగ్ లీడర్లు

- ఉమ్మడి పశ్చిమ గోదావరిలో భారీగా కోడి పందేలు
- రోజుకో చోట పందెం బరులు.. వాట్సప్‌లో సమాచారం
- పోలీసులకు పక్కా సమాచారం ఇచ్చి మరీ పందేలు

అత్యంత పకడ్బందీగా గత కొన్ని రోజులుగా ఉమ్మడి పశ్చిమలో కోడి పందేలు పెద్ద ఎత్తున జరుగుతున్నా ఎలంటి చర్యలు లేవు. లక్షలతో మొదలయ్యే ఈ పందేలు కోట్ల వరకు జరుగుతున్నాయి. దీంతో పందేల్ని వ్యసనంగా మార్చుకున్న కొందరు సామాన్యులు సమిధలుగా మారుతున్నారు. కేవలం సంక్రాంతి సమయంలో వినోదంగా జిల్లాలో ఈ కోడి పందేలు నిర్వహిస్తారు. అప్పుడప్పుడు పోలీసుల కళ్లుగప్పి పందేలు నిర్వహించినా అడపాదడపా మాత్రమే..

అయితే ఇప్పుడు కోడి పందేలు కూటమి నేతలకు ఆదాయ వనరుగా మారింది. దీంతో నెలలు తరబడి ఈ పందేలు యథేచ్ఛగా సాగుతున్నా.. పత్రికలు, టీవీల్లో వార్త కథనాలు వస్తున్నా పోలీసులు నిమ్మకు నీరెత్తినట్లు ఉంటున్నారు. గత 15 రోజుల నుంచి జిల్లాలోని కీలక నియోజకవర్గాల్లో ఉధృతంగా పందేలు సాగుతున్నా ఒక్క కేసు కూడా నమోదు కాని పరిస్థితి.

ఎప్పటికప్పుడు బరుల మార్పు

ఇప్పటికే మద్యాన్ని ప్రధాన ఆదాయ వనరుగా మార్చుకున్న కొందరు కూటమి నేతలు, గత కొంతకాలంగా కోడి పందేలపై దృష్టి పెట్టారు. దీంతో ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలో భారీ ఎత్తున పందేలకు తెరలేచింది. తాడేపల్లిగూడెం, ఉండి, భీమవరం నియోజకవర్గాల్లో ప్రజాప్రతినిధుల పర్యవేక్షణలో భారీగా పందెం బరులు వెలిశాయి. వారానికి మూడు, నాలుగు చోట్ల వీటిని సిద్ధం చేస్తున్నారు. ఒకే చోట నిర్వహించకుండా బరులు మారుస్తూ ఎప్పటికప్పుడు పందెంరాయుళ్లకు సమాచారం ఇస్తున్నారు. జిల్లా నుండే కాకుండా ఇతర జిల్లాలు, హైదరాబాద్ నుంచి పందెంరాయుళ్లను ప్రత్యేకంగా రప్పించి భారీగా సొమ్ముచేసుకుంటున్నారు.

సిండికేట్‌గా మారి బరుల ఏర్పాటు

కోడి పందేలపై ఆసక్తి ఉన్న ఇద్దరు ప్రజాప్రతినిధులు గత 20 రోజుల నుంచి ఈ పందేలను అందరికీ తెలిసేలా సాగిస్తున్నారు. ప్రధానంగా భీమవరం, వీరవాసరంలో జనసేన, టీడీపీ నేతలు ఒక ప్రజాప్రతినిధి ఆదేశాలతో సిండికేట్‌గా మారి భారీగా బరులు ఏర్పాటు చేసి పందేలు నిర్వహిస్తున్నారు. ఈ వ్యవహారం మొత్తంలో నియోజకవర్గ వ్యాప్తంగా ఒక కీలకనేత చక్కబెడుతూ రెవెన్యూ మొదలుకొని పోలీసుల వరకు అన్ని వ్యవస్థలను ముడుపులతో మేనేజ్ చేసి పందేలు కొనసాగిస్తున్నారు. దీంతోపాటు అక్కడే తినుబండారాలు మొదలుకొని మద్యం వరకు అన్ని విక్రయించే ఏర్పాట్లు కూడా అందుబాటులో ఉన్నాయి. దీంతో వ్యాపారం జోరుగా సాగుతోంది.

పోలీసులకు చెబితే రివర్స్‌లో వార్నింగ్

ప్రతి రోజూ జిల్లాలో సగటున 10 నుంచి 20 వరకు కోడిపందేలు, వారంలో ప్రతి నియోజకవర్గంలో రెండుసార్లు భారీ ఎత్తున పందేలు నిర్వహిస్తున్నారనేది జిల్లాలో పోలీసులతో సహా అందరికీ తెలిసిన విషయమే. పశ్చిమగోదావరి జిల్లా కేంద్రమైన భీమవరంలోనే జిల్లా ఎస్పీ ఉంటారు. ఎస్పీ కార్యాలయానికి సమీపంలోని గ్రామాల్లోనే పందేలు జోరుగా సాగుతున్నాయి. గత నెల 29న భీమవరం రూరల్ మండలంలో దిరుసుమర్రులో భారీగా పందేలు తెల్లవారుజాము వరకు నిర్వహించారు. స్థానికంగా పోలీసులకు కొందరు సమాచారం ఇచ్చినా.. వాట్సప్ గ్రూపుల్లో కోడి పందేల వీడియోలు పోస్టు చేసినా పోలీసులు పట్టించుకోలేదని ఆరోపణలున్నాయి.

కొందరు పోలీసులకు సమాచారం ఇవ్వగానే పోలీసుల నుంచి వార్నింగ్ కాల్స్ వచ్చినట్లు సమాచారం. తాడేపల్లిగూడెంలో పందేనికి ఫిక్స్‌డ్ రేటు నిర్ణయించి మరీ కింది స్థాయి నుంచి ఒక స్థాయి వరకు పోలీసులకు ముట్టచెబుతున్నారనే ఆరోపణలున్నాయి. ఉండి నియోజకవర్గంలోనూ ఇదే పరిస్థితి. వాస్తవానికి కోడిపందేల నిర్వాహకులు, కత్తుల తయారీ నిర్వాహకులపై ఇప్పటికే బైండోవర్ కేసులు నమోదు చేసి ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలి. పోలీసులు రాజకీయ ఒత్తిళ్ళతో ఆ దిశగా దృష్టి సారించడం లేదు.



కోడి పందేలు (ఫైల్‌ఫొటో)

జిల్లాలో ఎక్కడెక్కడ

- తాడేపల్లిగూడెంలోని ప్రభుత్వాసుపత్రి వెనుక భాగం, అమృతపురంలో పామాయిల్ తోటల్లో ఎక్కువగా పందేలు జరుగుతున్నాయి. ఇవి కాకుండా రోజుకో ప్రాంతంలో పందేలు నిర్వహిస్తూ వాట్సప్ గ్రూపుల్లో లొకేషన్స్ షేర్ చేసి ఎంపిక చేసిన వారినే అనుమతిస్తూ దర్జాగా దందా కొనసాగిస్తున్నారు.
- ఉండి నియోజకవర్గంలో కోడి పందేల జోరు అధికంగా ఉంది. ఎన్ఆర్‌పీ అగ్రహారం, ఉండి శివారులోని గణపవరం రోడ్డు, మహదేవపట్నం, పాలకోడేరు, గరగపర్రు, మోగల్లు, పాందువ్వ, కాళ్ళ మండలంలో జువ్వలపాలెం, ఏలూరుపాడు, కలవపూడి, పాతాళ్ళమెరక, ఆకివీడు మండలంలో ఐ.భీమవరం, పెద్దాపురం, దుంపగడప తదితర గ్రామాల్లో విస్తృతంగా పందేలు సాగుతున్నాయి.
- రూ. 5 లక్షల నుంచి కోట్ల వరకు పందేలు నిర్వహిస్తున్నారు. మద్యంతో సహా అన్ని ఏర్పాట్లు చేసి మరీ పందెంరాయుళ్లను ఆహ్వానిస్తున్నారు. భారీ ఫ్లడ్‌లైట్ల కాంతిలో రాత్రిపూట కూడా యథేచ్ఛగా పందేలు సాగుతున్నాయి. ఇంత జరుగుతున్నా పోలీసులు ఏ మాత్రం పట్టించుకోకపోవడం గమనార్హం.

● అమ్మకు బిడ్డ భారమా !



ఈ సృష్టిలో అమ్మ ప్రేమను మించింది లేదు అంటారు. ఎంత కష్టమైనా బిడ్డ భారం తనపై వేసుకుని ప్రేమను పంచుతుంది. అందుకు ఉదాహరణే ఈ చిత్రం. వేలేరుపాడు మండలం కొత్తూరులో ఈ దృశ్యం 'సాక్షి' కెమెరాకు చిక్కింది. ఒక పక్క వరికోతలో బిజీగా ఉన్నా.. తన బిడ్డ ఎటూ వెళ్లిపోకుండా ఇలా వీపుపై కూర్చోబెట్టుకునే ఈ మాతృమూర్తి పనిచేస్తోంది. బిడ్డతో కబుర్లు చెబుతూ తన కష్టమంతా మర్చిపోతోంది. - వేలేరుపాడు

కేడర్ నో.. చంద్రబాబు ఎస్

- నేడు టీడీపీలో చేరనున్న మాజీ మంత్రి ఆళ్ల నాని
- ఏలూరు టీడీపీ కేడర్‌ను పట్టించుకోని అధిష్టానం
- నగర నేతల నిరసనలకు స్పందన నిల్
- నాని చేరికను ప్రకటించిన ఎమ్మెల్యే బడేటి చంటి



సాక్షి ప్రతినిధి, ఏలూరు: ఏలూరు నగర టీడీపీ కేడర్ నో చెప్పినా.. ఆళ్ల నానిని పార్టీలో చేర్చుకునేందుకు టీడీపీ అధిష్టానం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. పార్టీకి తీవ్ర నష్టం జరుగుతుందంటూ సోషల్ మీడియా మొదలుకొని స్థానికంగా సమావేశాలు నిర్వహించి ఆళ్ల నానిపై అసమ్మతి సెగ వినిపించారు. కేడర్ అభిప్రాయాలను ఎమ్మెల్యే బడేటి చంటి ఒకటికి రెండుసార్లు చంద్రబాబుకు చెప్పినా వినలేదు. చివరకు బడేటి చంటితోనే ఆళ్ల నాని టీడీపీలో చేరతారని ప్రకటన చేయించడం చర్చనీయాంశంగా మారింది.

కేడర్‌ను పట్టించుకోని అధిష్టానం

గతంలో నాని వల్ల వ్యక్తిగతంగా తమకు తీవ్ర నష్టం జరిగిందంటూ పెద్ద ఎత్తున అధిష్టానానికి ఏలూరు టీడీపీ నేతలు ఫిర్యాదు చేశారు. ప్రధానంగా కొందరు నేతలను టార్గెట్ చేసి నాని వేధించారంటూ పూర్తి ఆధారాలతో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, మంత్రి లోకేష్‌కు అందించారు. ఈ క్రమంలో కార్యకర్తల ఇష్టానికి వ్యతిరేకంగా పార్టీ నడుచుకోదని ఏలూరు నగర నేతలందరితో సమావేశం ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. ఈ వ్యవహారాన్ని సమన్వయ పరిచే బాధ్యత అచ్చెన్నాయుడుకు అప్పగించారు. డిసెంబర్ 3న నాని టీడీపీలో చేరడం ఖరారు కావడంతో నగర టీడీపీ నేతలు విలేకరుల సమావేశం నిర్వహించి మరీ తీవ్ర విమర్శలు గుప్పించారు. దాంతో నాని చేరిక వా9వ తేదిన చేరతారని ప్రచారం చేయగా చివరిగా బుధవారం చేరుతున్నట్లు ఏలూరు ఎమ్మెల్యే బడేటి చంటి ప్రకటించడంతో కేడర్ అవాక్కయ్యారు. అయితే ఎలాంటి సమావేశం నిర్వహించకపోవడం, పార్టీ ముఖ్యులు అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకోకపోవడంతో కేడర్ అసహనంతో రగిలిపోతున్నారు. ఎమ్మెల్యే ఉదయం నుంచి అందర్నీ సర్దుబాటు చేసే పనిలో నిమగ్నమైనా ప్రయోజనం పెద్దగా కనపడని పరిస్థితి.

మనం చెప్పాల్సింది చెప్పాం

ఆళ్ల నాని చేరిక నేపథ్యంలో మంగళవారం ఎమ్మెల్యే బడేటి చంటి నేతృత్వంలో నగర సమావేశం నిర్వహించారు. టీడీపీ నేతలు ఎస్ఎంఆర్ పెదబాబు, కంప్యూటర్ ప్రసాద్‌తో సహా ముఖ్యులందరూ హాజరయ్యారు. కేడర్ మనోభావాలకు వ్యతిరేకంగా నిర్ణయం తీసుకోవద్దని కార్యకర్తలు పడిన ఇబ్బందులు, గతంలోనే చంద్రబాబుకు వివరించానని ఎమ్మెల్యే అన్నారు. ఈ క్రమంలో నగర టీడీపీ నేతలతో అధిష్టానం ప్రత్యేక సమావేశం నిర్వహించి నిర్ణయం ప్రకటిస్తుందని చెప్పారు. అయితే సమావేశం నిర్వహించలేదు. రేపు నాని చేరిక ఉంటుందని తనకు సమాచారం ఇచ్చారని, పోలవరం పర్యటనలో కూడా ముఖ్యమంత్రి అదే చెప్పారని బడేటి చంటి కార్యకర్తలకు వివరించారు. కార్యకర్తలందరిని సర్దుకోమని సూచిస్తూ ఆళ్ల నానిని స్వాగతిస్తున్నామని ప్రకటించారు. ఎందుకు పార్టీలో చేరుతున్నారో నానినే సమాధానం చెబుతారని తెలిపారు. బుధవారం ఉదయం 11 గంటల లోపు నాని చేరతారని తెలిపారు.

జగన్ పుట్టిన రోజున సేవా కార్యక్రమాలు



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ కవురు శ్రీనివాస్

వీరవాసరం: మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి జన్మదినం సందర్భంగా పెద్ద ఎత్తున సేవా కార్యక్రమాలు చేపడతామని ఎమ్మెల్సీ కవురు శ్రీనివాస్ తెలిపారు. వీరవాసరం మండలం నవుడూరు జంక్షన్‌లో వైఎస్సార్‌సీపీ ముఖ్య నాయకులు సమావేశం మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డిసెంబర్ 21న జన్మదిన వేడుకల్లో పెద్ద ఎత్తున పాల్గొనాలని పిలుపునిచ్చారు. కార్యకర్తలు, నాయకులకు పార్టీ ఎప్పుడు అండగా నిలుస్తుందని వివరించారు. జగన్ జన్మదిన వేడుకలను వాడవాడలా చేయడానికి నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున సిద్ధమవ్వడం ఆనందంగా ఉందన్నారు. సమావేశంలో మాజీ జెడ్పీటీసీ మానుకొండ ప్రదీప్ కుమార్, మాజీ మండల కన్వీనర్ గూడూరు ఓంకారం తదితరులు పాల్గొన్నారు.

పోలవరం నిర్వాసితుల గోడు పట్టదా?

ఏలూరు (టూటౌన్): ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు పోలవరం ప్రాజెక్టు నిర్మాణానికి భూములు ఇచ్చి సర్వం కోల్పోయిన నిర్వాసితుల ఊసు ఎత్తకపోవడం, వారి గోడు పట్టించుకోకపోవడం తీవ్ర ఆవేదన కలిగించిందని సీపీఎం జిల్లా కార్యదర్శి ఎ.రవి తెలిపారు. మంగళవారం ప్రకటన విడుదల చేస్తూ.. పోలవరం పర్యటనకు వచ్చిన చంద్రబాబు నిర్వాసితుల పరిహారం, పునరావాసంపై మాట్లాడకపోవడం అన్యాయమన్నారు. సీపీఎం పోలవరం ప్రాజెక్టు నిర్మాణానికి వ్యతిరేకం కాదని, నిర్వాసితుల సమస్యలు పరిష్కరించిన తర్వాతే నిర్మాణం చేపట్టాలనే విషయం విస్మరించడం సరికాదన్నారు. ప్రాజెక్టు వల్ల ఒక లక్ష కుటుంబాలు నిర్వాసితులయితే ఇంతవరకు కేవలం 10 నుండి 15 శాతం మందికి మాత్రమే పరిహారం చెల్లించి, పునరావాసం కల్పించారని తెలిపారు. పునరావాస కాలనీల్లో సరైన రోడ్లు, డ్రైయిన్లు, ఆరోగ్య కేంద్రాలు, స్కూళ్లు, ఉపాధి లేక అనేక అవస్థలు పడుతున్నారని చెపఆరు. తెలుగుదేశం కూటమి ప్రభుత్వం నిర్వాసితులకు తీరని అన్యాయం చేసిందని విమర్శించారు. ఇప్పటికైనా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు న్యాయం చేయాలని, పూర్తి పరిహారం చెల్లించాలని కోరారు.

● తరం మారింది



ధనుర్మాసం రాకతో వీధుల్లో హరిదాసుల కీర్తనలు మార్మోగుతాయి. తరం మారడంతో హరిదాసులు మోటార్ సైకిల్‌పై అక్షయ పాత్ర పెట్టుకుని హరినామ సంకీర్తనలను వాయిస్ రికార్డుల్లో వినిపిస్తున్నారు. పాలకొల్లు పుర వీధుల్లో తిరుగుతున్న ఈ హరిదాసు పేరు దుర్గారావు. ఆయన తాత, తండ్రి ధనుర్మాస సమయంలో పాలకొల్లు వచ్చి నెలరోజుల పాటు ఉండేవారు. - పాలకొల్లు అర్బన్

శ్రీవారి తిరువీధి సేవలు ప్రారంభం



తొళక్క వాహనంపై ఊరేగుతున్న శ్రీవారు



ప్రత్యేక ఆకర్షణగా గజలక్ష్మి

ద్వారకాతిరుమల: ధనుర్మాస ఉత్సవాలను పురస్కరించుకుని శ్రీవారి తిరువీధి సేవలు మంగళవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఉత్సవాల్లో భాగంగా స్వామివారు ఉభయ దేవేరులు, గోదాదేవితో కలసి తొళక్క వాహనంపై క్షేత్ర పురవీధుల్లో అట్టహాసంగా ఊరేగారు. ముందుగా ఆలయంలో అర్చకులు స్వామి, అమ్మవార్లు, గోదాదేవి ఉత్సవ మూర్తులను తొళక్క వాహనంపై ఉంచి ప్రత్యేక పుష్పాలంకారాలు చేశారు. పూజాధికాల అనంతరం హారతులిచ్చారు. ఆ తరువాత శ్రీవారి వాహనం మేళతాళాలు, మంగళ వాయిద్యాలు, అర్చకులు, పండితుల వేద మంత్రోచ్ఛరణలు, గజ, అశ్వ సేవలు, భక్తుల గోవింద నామస్మరణల నడుమ ఆలయ ప్రధాన రాజగోపురం మీదుగా పురవీధులకు పయనమైంది. ప్రతి ఇంటి ముంగిట భక్తులు శ్రీవారు, అమ్మవార్లకు నీరాజనాలు సమర్పించారు. అనంతరం ఆలయ ప్రధాన కూడలిలోని ధనుర్మాస మండపంలో శ్రీవారు, అమ్మవార్లు, గోదాదేవికి అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించి, భక్తులకు తీర్థప్రసాదాలను పంపిణీ చేశారు.

ముగిసిన నీటి సంఘాల ఎన్నికలు

భీమవరం (ప్రకాశంచౌక్): పశ్చిమ డెల్టా నీటి పంపిణీ సంఘాల అధ్యక్షుల ఎన్నికలను పూర్తి చేసినట్లు కలెక్టర్ చదలవాడ నాగరాణి తెలిపారు. డిసెంబర్ 14న నిర్వహించిన ఈ ఎన్నికల్లో ఎన్నికైన అధ్యక్షుల ద్వారా నేడు పశ్చిమ డెల్టా నీటి పంపిణీ సంఘాల అధ్యక్ష, ఉపాధ్యక్షులను ఎన్నుకుంటామన్నారు.

క్లుప్తంగా

ఆన్‌లైన్ చెల్లింపుతో మోసపోయిన మహిళ

భీమవరం: ఫర్నిచర్ కోసం ఆన్‌లైన్‌లో సొమ్ములు చెల్లించి మోసపోయానంటు గొల్లల కోడేరు గ్రామానికి చెందిన ఇసుకపల్లి శృతి మంగళవారం పోలీసులను ఆశ్రయించింది. భీమవరం టుటౌన్ ఏఎస్సై మోహన్ తెలిపిన వివరాల ప్రకారం ఇటీవల శృతి ఇంటికి అవసరమైన ఫర్నీచర్ కోసం ఆన్‌లైన్‌లో ఆర్డర్ చేసింది. దానికి సంబంధించి రూ. 72,500 చెల్లింపు చేసింది. అయితే ఎన్ని రోజులున్నా ఫర్నీచర్ ఇంటికి రాకపోగా, ఆర్డర్ హిస్టరీలో కూడా ఆర్డర్ వివరాలను కనిపించకపోవడంతో మోసపోయినట్లు గుర్తించి ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు మోహన్ చెప్పారు.

శ్రీవారి ఆలయంలో గుర్రం మృతి



గోసంరక్షణశాలలో మృతి చెందిన శ్రీనివాస అశ్వం

ద్వారకాతిరుమల: శ్రీవారి సేవలకు వినియోగించే మగ గుర్రం కొండపైన గోసంరక్షణశాలలో మంగళవారం తెల్లవారు జామున మృతి చెందింది. అనారోగ్యంతో బాధపడుతున్న ఈ అశ్వం ఉన్నట్టుండి అకస్మాత్తుగా తెల్లవారుజామున 4 గంటల సమయంలో కుప్పకూలి పడిపోవడంతో, గోసంరక్షణశాల అధికారులు వెంటనే స్పందించి పశు వైద్యులతో చికిత్సను అందించారు. అయితే కొద్ది సేపటికే అది మృతి చెందింది. ఈ వయస్సు సుమారు 20 సంవత్సరాలు ఉంటుంది. నాలుగేళ్ల క్రితం గ్రామానికి చెందిన మొగతడకల శ్రీనివాసరావు ఈ అశ్వాన్ని స్వామివారి సేవల నిమిత్తం దేవస్థానానికి అందించారు. దాతలు అందించిన మూడు అశ్వాల్లో రెండేళ్ల క్రితం ఆడ (శ్వేత) అశ్వం, ఆ తరువాత దాని పిల్ల మృతి చెందగా, తాజాగా శ్రీనివాస అశ్వం మృతి చెందింది.

మీకోసం.. ఎవరి కోసం?

- మీ కోసం ఫిర్యాదుల పరిష్కారంలో కొరవడిన పారదర్శకత
- పశువధశాలపై ఫిర్యాదు ఇచ్చిన స్థానికులు
- సమస్య పరిష్కరించకుండానే పరిష్కారమైనట్లు మెసేజ్‌లు

తణుకు అర్బన్: నిర్బంధం, నియంతృత్వంతో నిర్వహిస్తున్న పశువధ దందా అక్కడ ఉన్న నీరు, గాలి కాలుష్య పరిస్థితులపై తమకు న్యాయం చేయాలని ప్రజలు ప్రజా సమస్యల పరిష్కార వేదిక(మీ-కోసం)లో చేసుకున్న ఫిర్యాదులను అధికారులు పట్టించుకోలేదు. ఆ ప్రాంతంలో ఎటువంటి దుర్గంధం లేదని, దుర్వాసన లేదని రక్తపు నీరు లేదంటూ లేహం ఫుడ్ ప్రొడక్ట్స్ సంస్థ నిర్వహణకు అధికారులు పర్మిషన్ ఇచ్చేశారు. ఒకవైపు సదరు కర్మాగారం వ్యవహారం న్యాయస్థానంలో పెండింగ్‌లో ఉన్నా ఆ దిశగా అధికారులు అడుగులు వేయకపోవడంపై పాలకుల ఒత్తిడా? లేక ఇతర పరిస్థితులా? అని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. కర్మాగారం చుట్టుపక్కల నివసిస్తున్న ప్రజలు కూటమి ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న మీ-కోసం ఎవరికోసం? అంటూ నిలదీస్తున్నారు.

9న ఫిర్యాదు

పశువధ శాల సమస్యను పరిష్కరించాలని ఆ ప్రాంత ప్రజలు ఈ నెల 9న తణుకు తహసీల్దారు కార్యాలయంలో నిర్వహించిన మీ-కోసం కార్యక్రమంలో 99 మంది ఫిర్యాదులు అందజేశారు. అయితే ఆ ఫిర్యాదుల నేపథ్యంలో ఈనెల 16న తేతలి పంచాయితీ సిబ్బంది ఇంటింటికి వెళ్లి ఆ ప్రాంతాన్ని



ప్రజా సమస్యల పరిష్కార వేదిక (PGRS)

మీకోసం ఫిర్యాదు కాపీ

పరిశీలించి, అక్కడ ఎలాంటి ఇబ్బందులు లేవు అని చెప్పి ధ్రువపత్రాలపై సంతకాలు చేయాలని కోరారు. చిర్రెత్తుకొచ్చిన స్థానికులు ఈ ఒక్కరోజు శుభ్రంగా ఉంచితే సరిపోదని, కర్మాగారాన్ని పూర్తిగా మూయించాలని డిమాండ్ చేసి సంతకాలు చేసేందుకు నిరాకరించారు. దీంతో అదే రోజు ఫిర్యాదుదారుల ఫోన్‌లకు మీ కోసంలో మీరు చేసుకున్న దరఖాస్తుకు సంబంధించి సమస్యను పరిష్కరించడమైంది అని మెసేజ్ రావడంతో స్థానికులకు షాక్ ఇచ్చింది.

ఒక్కరోజు మాతో ఉంటారా?

కర్మాగారం ప్రాంతంలో ఎలాంటి ఇబ్బందులు లేవని చెబుతున్న అధికారులు కర్మాగారంలో పశువధ నిర్వహిస్తున్న సమయంలో ఒక్కరోజు మాతో కలిసి మా ఇంట్లో నివసించాలని అప్పుడు కూడా



లేహం ఫుడ్ ప్రొడక్ట్ సంస్థ కర్మాగారానికి అర్ధరాత్రి సమయంలో వెళ్తున్న పశువుల ట్రక్కులు (ఫైల్)

ఎటువంటి ఇబ్బందులు లేవని చెబితే అప్పుడు ఆలోచిస్తామని విమర్శిస్తున్నారు. పట్టణ ప్రాంతంలో అద్దెలు చెల్లించలేక దూరంగా ఉంటున్నామని కొందరు, సొంతిళ్లు వదలి రాలేక ఇక్కడ ఉంటున్నామని కొందరు వాపోతున్నారు. మా నివాసాల వద్ద పశు వధ కర్మాగారాన్ని ఏర్పాటు చేసి ఏ ఇబ్బందులు లేవంటే ఎలా ఉంటుందని మీ ఇంటిపక్కనే ఉంటే మీరు ఎలా ఉంటారు? అని నిలదీస్తున్నారు.

పెరుగుతున్న వ్యతిరేకతతో రంగంలోకి అధికారులు

తణుకు మండలం తేతలి పరిధిలోని సత్యవాడ రోడ్డులో నిర్వహిస్తున్న పశు వధ కర్మాగారంపై రోజు రోజుకీ తణుకు, చుట్టుపక్కల గ్రామాల్లో పెరుగుతున్న వ్యతిరేకతతో అధికారులపై ఒత్తిడి పెరుగుతుంది. అంతేకాకుండా సోషల్ మీడియాలో సైతం సేవ్ తణుకు అనే నినాదం వైరల్‌గా మారింది. దీంతో ఈ నెల 15 అంటే ఆదివారం సెలవు రోజున హడావుడిగా అత్తిలి పశుసంవర్ధక శాఖ సహాయ సంచాలకులు డాక్టర్ కె.నరసింహారావు ఒక పత్రికా ప్రకటన విడుదల చేశారు. లేహం ఫుడ్ ప్రొడక్ట్స్ సంస్థ నడుపుతున్న కర్మాగారంలో గోవధ జరగడంలేదని, చూలికట్టని, ఒట్టిపోయిన ఆరోగ్యంగా ఉన్న గేదెలు, గేదె జాతికి సంబంధించిన పశువులను వధించి మాంసాన్ని క్వాలిటీ పరీక్షల అనంతరమే ఇతర దేశాలకు ఎగుమతి చేస్తున్నారని వెల్లడించారు. ఇక రెవెన్యూ అధికారులైతే కర్మాగారం ప్రాంతంలో ఎటువంటి ఇబ్బందులు లేవని అంతా సజావుగే ఉందనే రీతిలో ప్రకటన చేయడం విడ్డూరంగా ఉందని స్థానిక నివాసితులు ఎద్దేవా చేస్తుండడం విశేషం.

అనుమతి లేని విగ్రహాన్ని మంత్రి ఆవిష్కరించడమేంటి?



గౌడ నాయకుడి ఇంటి తలుపునకు అంటించిన నోటీసు

నూజివీడు: పట్టణంలో రద్దీగా ఉండే బస్టాండు సెంటర్‌లో ఎలాంటి అనుమతులు లేకుండా ఏర్పాటు చేసిన గౌతు లచ్చన్న విగ్రహాన్ని రాష్ట్ర గృహనిర్మాణ, సమాచారశాఖ మంత్రి కొలుసు పార్థసారథి ప్రారంభించడం ఏంటి? అని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. మున్సిపాలిటీ అనుమతి గానీ, జిల్లా కలెక్టర్ అనుమతి గానీ ఏమీ తీసుకోకుండా అనధికారికంగా విగ్రహాన్ని ఏర్పాటు చేయడంపై మొదటి నుంచి ప్రజల్లో వ్యతిరేకత వ్యక్తమవుతుంది. మున్సిపల్ కౌన్సిల్ సమావేశంలో అనుమతి కోసం ఎజెండాలో ఒక అంశంగా పెట్టగా నిబంధనల ప్రకారం ఆర్అండ్‌బీ స్థలాల్లో విగ్రహాలను ఏర్పాటు చేయడానికి వీల్లేదని కౌన్సిల్ తిరస్కరించింది. పట్టణంలో ఎన్టీఆర్, వైఎస్సార్, ఎమ్మార్ అప్పారావు విగ్రహాలను ఏర్పాటు చేయడానికి అనుమతి కోసం కౌన్సిల్ సమావేశం ఎజెండాలో అంశాన్ని రెండు నెలల క్రితం పెట్టగా అప్పుడు టౌన్ ప్లానింగ్ అధికారులు అభ్యంతరం చెప్పారు. ఇప్పుడు అధికారులు మాత్రం తమ తప్పు లేదు అని అనిపించుకోవడానికి గౌడ సంఘానికి చెందిన ఒక వ్యక్తి ఇంటి తలుపుకు మాత్రం గౌతు లచ్చన్న విగ్రహాన్ని తొలగించాలని శనివారం నోటీసును అంటించారు? విగ్రహ ఏర్పాటు విషయంలో మున్సిపల్ అధికారుల తీరుపై ప్రజలు మండిపడుతున్నారు.

పెరుగుతున్న బంగారం బాధితులు

నిందితుడిని పట్టుకునేందుకు ప్రత్యేక టీమ్

తాడేపల్లిగూడెం: విజయవాడ, నరసాపురం, తాడేపల్లిగూడెం పట్టణంలో బంగారు, వెండి, వజ్ర ఆభరణాలు చేసి ఇస్తామని 12 మంది వ్యాపారులకు టోకరా వేసిన వ్యక్తి కోసం తాడేపల్లిగూడెం పట్టణ పోలీసులు ప్రత్యేక టీమ్‌ను ఏర్పాటు చేసినట్టు తెలుస్తోంది. పట్టణ ఎస్సై ఆధ్వర్యంలో టీమ్ అన్వేషణ ప్రారంభించినట్టుగా సమాచారం. సోమవారం వెలుగులోకి వచ్చిన ఈ వ్యవహారానికి సంబంధించి బాధితుల సంఖ్య మంగళవారానికి పెరిగినట్టుగా చెబుతున్నారు. సుమారు టోకరా వేసిన వ్యక్తి వ్యాపారుల వద్ద దగ్గర నుంచి సుమారు 15 కిలోల బంగారం తీసుకున్నట్టుగా విశ్వసనీయ సమాచారం. ఈ మేరకు బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేసినట్టుగా తెలుస్తోంది. పట్టణంలోని ఎన్టీఆర్ చౌక్ సమీపంలో ఆరోపణలు ఎదుర్కొంటున్న వ్యక్తి సుమారు ఐదు నెలల క్రితమే వ్యాపారం ప్రారంభించారు. ఇంత స్వల్పకాలంలో ఏ ప్రాతిపదికన వ్యాపారులు టోకరా వేసినట్టుగా చెబుతున్న వ్యక్తికి బంగారం, వెండి, వజ్రాలు వంటివి ఇచ్చారు? అని పోలీసులు ఆరా తీస్తున్నారు. ఇవి అధికారిక లావాదేవీలా? లేక అనధికారిక లావాదేవీలా? ట్యాక్స్ ఎగవేయడానికి ఈ మార్గాన్ని వ్యాపారులు ఎంచుకున్నారా? అనే ప్రశ్నలకు సమాధానం లేదు. సాధారణంగా బంగారం వ్యాపారం అరువుపై సాగుతుంది. అంటే సరుకు తీసుకున్నాక అమ్మకాలు జరిగాక సొమ్ము చెల్లిస్తారు. జీఎస్‌టీ ఇతర పన్నులు ఎగవేతతో ముడిపడే బంగారం వ్యాపారం సాగుతుందనేది బహిరంగ రహస్యం. నిందితుడు వెండి, బంగారు వస్తువులను తయారు చేయించి ప్రతి దుకాణం తిరుగుతూ ఇచ్చే వ్యాపారం గతంలో చేసేవారట. దీంతో వ్యాపారులతో నమ్మకం కుదిరిన తర్వాత అక్రమ మార్గంలో ట్యాక్స్ బారిన పడకుండా బంగారు బిస్కెట్ ధరపై ఒక శాతం లాభం వేసుకుని నిందితుడు బంగారం, వెండి, వజ్ర ఆభరణాలు డెలివరీ చేసేవాడట. ఈ నేపథ్యంలో పెద్ద మొత్తంలో వ్యాపారులు నిందితుని చేతిలో మోసపోయారని సమాచారం. రోజులు గడిచే కొద్దీ ఇంకెంత మంది బాధితులు బయటకు వస్తారో? వేచి చూడాల్సి ఉంది.

పిండమార్పిడి ప్రక్రియ సక్సెస్

తొలిసారి ఆవుకు ఒంగోలు జాతిపెయ్యి దూడ జననం



ఒంగోలు జాతి పెయ్యిదూడను పరిశీలిస్తున్న జిల్లా పశువైద్యాధికారి డాక్టర్ కె.మురళీకృష్ణ

పెనుగొండ: పిండమార్పిడి ప్రక్రియ ద్వారా పోడూరులో ఒక ఆవు పశ్చిమగోదావరి జిల్లాలోనే తొలిసారిగా ఒంగోలు జాతి పెయ్యిదూడ కు జన్మనిచ్చింది. గ్రామానికి చెందిన తాడి వెంకట శ్రీనివాస రెడ్డి ఒంగోలు ఆవు పిండ మార్పిడి ప్రక్రియ ద్వారా మంగళవారం ఉదయం ఒంగోలు పెయ్యి దూడకు జన్మనిచ్చింది. ఈ పక్రియను విజయవంతంగా పూర్తి చేసేందుకు ఆచంట మండల పశువైద్యాధికారి డాక్టర్ ఎల్.ఫణికుమార్ ఎప్పటి నుంచో చేస్తున్న కృషి ఫలించింది. పిండమార్పిడి పక్రియ విజయవంతం కావడంతో రానున్న రోజుల్లో పాల ఉత్పత్తులను బాగా పెంచవచ్చని పాడి రైతుల్లో సంతోషం వ్యక్తమవుతోంది. శ్రీనివాసరెడ్డికి చెందిన ఒంగోలు ఆవుకు డాక్టర్ ఫణికుమార్ ఈ ఏడాది మార్చి 4న క్రాస్ బ్రీడ్ ప్రవేశపెట్టారు. ఆ ఆవు మంగళవారం ఉదయం ఒంగోలు జాతి పెయ్యిదూడకు జన్మనిచ్చింది. ఈ సందర్భంగా డాక్టర్ ఫణికుమార్ మాట్లాడుతూ పశువుల్లో పిండమార్పిడి ప్రక్రియలో భాగంగా ఒక మేలుజాతి ఎద్దు నుంచి వీర్యం, అలాగే మేలుజాతి ఆవు నుంచి అండాలను సేకరించి ప్రయోగశాలలో ఫలదీకరించడం జరుగుతుందన్నారు. ఈ ప్రక్రియకోసం పాల ఉత్పత్తులను బట్టి మేలుజాతి ఆవులను ఎంపిక చేస్తారన్నారు. ఈ ప్రక్రియ కోసం మామూలు వీర్యం లేదా లింగనిర్ధారిత వీర్యాన్ని ఉపయోగిస్తామన్నారు. ప్రయోగశాలలో ఫలదీకరించిన తరువాత అభివృద్ధి చెందిన పిండాన్ని తక్కువ పాలు ఇచ్చే ఆవుల గర్భంలో ప్రవేశ పెడతారని వివరించారు. ఈ ప్రక్రియ ద్వారా పుట్టే దూడలకు పూర్తిగా దాత లక్షణాలు వస్తాయన్నారు. ఈ పద్ధతిలో 8 తరాల తర్వాత సాధించే మేలుజాతి సంతతిని ఒక్క ఏడాదిలోనే సాధించగలమన్నారు. ఈ విధంగా మేలుజాతి ఆవులను అభివృద్ధి చేసి పాల ఉత్పత్తులను గణనీయంగా పెంచవచ్చని చెప్పారు. పిండమార్పిడి ప్రక్రియతో ఒంగోలు జాతి పెయ్యిదూడను విజయవంతంగా జన్మించేలా చేయడంతో డాక్టర్ ఫణికుమార్‌ను జిల్లా పశువైద్యాధికారి డాక్టర్ కె.మురళీకృష్ణ, పశువైద్యాధికారులు, పాడిరైతులు అభినందిస్తున్నారు.

వీఐపీ దర్శనం పేరుతో డబ్బు కొట్టేసిన ఇద్దరి అరెస్ట్

తణుకు అర్బన్: తిరుమల తిరుపతి వేంకటేశ్వర స్వామి వీఐపీ దర్శనం ఇప్పిస్తానని డబ్బు కాజేసిన ఇద్దరు వ్యక్తులను పోలీసులు అరెస్టు చేశారు. తణుకు పట్టణ ఎస్సై కె.చంద్రశేఖర్ తెలిపిన వివరాల ప్రకారం హైదరాబాద్‌కు చెందిన గునిశెట్టి రాజకుమార్, వైట్ల సురేష్‌లు తాము తణుకు ఎమ్మెల్యే కార్యాలయంలో విధులు నిర్వర్తిస్తున్నట్లుగా నమ్మించి కలిశెట్టి సూర్యప్రకాష్‌కు టీటీడీ దర్శనం ఇప్పిస్తానని మాయమాటలు చెప్పి రూ. 31 వేలు ఆన్‌లైన్ పేమెంట్ చేయించుకున్నారు. తరువాత నుంచి ఫోన్ ఎత్తకపోవడంతో వేల్పూరు గ్రామానికి చెందిన బేతిన వేణుగోపాల్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేసి ఇద్దరి నిఅరెస్టు చేశామని పోలీసులు చెబుతున్నారు. వారి నుంచి రెండు మొబైల్స్, రూ. 3220 నగదు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. నిందితులపై తణుకుతో పాటు నరసాపురం, నెల్లూరు, కాకినాడ, హైదరాబాద్ తదితర ప్రాంతాల్లో పలు నేరాలపై కేసులు ఉన్నాయని దర్యాప్తులో తేలిందని వివరించారు. ముద్దాయిలను కోర్టులో హాజరుపరచగా ఈ నెల 29 వరకు రిమాండ్ విధించినట్లు తెలిపారు. జిల్లా ఎస్పీ, తాడేపల్లిగూడెం డీఎస్పీ సూచనల మేరకు సీఐ కె.కొండయ్య నేతృత్వంలో కేసును చేధించినట్లు వివరించారు.

20 నుంచి జూడో పోటీలు

ఏలూరు రూరల్: ఆచార్య నాగార్జున యూనివర్శిటీ ఆవరణలో ఈ నెల 20 నుంచి 22 వరకూ రాష్ట్రస్థాయి మెన్, ఉమెన్, బాలబాలికల జూడో పోటీలు జరగనున్నాయని ఏలూరులో జూడో కోచ్ చందు మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ పోటీల్లో పాల్గొనే ఏలూరు జిల్లా జట్లను ఎంపిక చేసేందుకు ఈ నెల 19న ఏలూరు అల్లూరి సీతారామరాజు స్టేడియంలో పోటీలు నిర్వహిస్తామని వెల్లడించారు. సీనియర్‌తో పాటు అండర్ 12, 15, 18 విభాగాల్లో పాల్గొనే బాలబాలికలు సమాచారం కోసం 81424 84269 నంబర్‌కు ఫోన్ చేయాలని కోరారు.

అనుమానంతో భార్యను హతమార్చిన భర్త

ఆగిరిపల్లి: మండలంలోని సగ్గూరులో దారుణం వెలుగు చూసింది. అనుమానంతో కట్టుకున్న భార్యనే భర్త హత్య చేశాడు. ఎస్సై శుభ శేఖర్ తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని సగ్గూరుకి చెందిన లాము రమేష్ కి కృష్ణాజిల్లా ఉప్పులూరుకి చెందిన మనీషా(27)తో పది సంవత్సరాల క్రితం పెళ్లయ్యింది. వారికి ఇద్దరు పిల్లలు, భార్యపై అనుమానంతో తరచూ గొడవలకు దిగేవాడు. ఇదే విషయమై సోమవారం మధ్యాహ్నం వివాదం తలెత్తింది. దీంతో ఇద్దరూ ఘర్షణకు దిగారు. తీవ్ర కోపోద్రిక్తుడైన భర్త ఆమెను గొంతు నులిమి చంపేశాడు. ఏమీ తెలియనట్టు మనీషా ఉరి వేసుకుని చనిపోయిందని నమ్మించేందుకు ప్రయత్నించాడు. అనుమానం వచ్చి మహిళ కుటుంబ సభ్యులు గట్టిగా నిలదీయడంతో భార్యను గొంతు నులిమి హత్య చేసినట్లు ఒప్పుకున్నాడు. మృతురాలి అన్నయ్య ఏసురత్నం ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్సై శుభశేఖర్ కేసు నమోదు చేశారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని నూజివీడు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

ముగిసిన ఇంటర్ కాలేజ్ ఫుట్‌బాల్ టోర్నమెంట్



విజేతగా నిలిచిన టీమ్‌కు మెమెంటోను అందజేస్తున్న ఆర్డీఓ దాసి రాజు

నరసాపురం రూరల్: గత రెండు రోజులుగా సాగుతున్న సెంట్రల్ జోన్ ఇంటర్ కాలేజ్ ఫుట్‌బాల్ టోర్నమెంట్ మంగళవారం ఫైనల్స్‌లో ఉత్కంఠగా జరిగాయి. నరసాపురం మండలం సీతారామపురం గ్రామంలో స్వర్ణాంధ్ర ఇంజనీరింగ్ కళాశాలలో నిర్వహించిన ఈ పోటీలు ఉత్సాహంగా సాగాయి. ఫైనల్స్‌లో భీమరం విష్ణు కళాశాల, రాజమండ్రి గైట్ కళాశాలల మ్యాచ్‌లు మధ్య జరిగిన టోర్నమెంట్‌లో క్రీడాకారుల మంచి పోటీ తత్వాన్ని కనబర్చారు. తొలుత స్వర్ణాంధ్ర కళాశాల చైర్మన్ కేవీ సత్యనారాయణ క్రీడాకారులను పరిచయం చేసుకుని ఫైనల్ పోటీలను ప్రారంభించారు. అనంతరం జరిగిన ఈ పోటీల్లో భీమవరం విష్ణు జట్టు ప్రథమ స్థానంలో నిలవగా భీమవరం గైట్ ద్వితీయ స్థానంలో నిలిచింది. మూడో స్థానంలో సీఆర్ రెడ్డి, ఆదిత్య కళాశాలలు నిలిచాయి. పోటీల్లో గెలుపొందిన వారికి నరసాపురం ఆర్డీఓ దాసి రాజు చేతుల మీదుగా మెమెంటోలు అందజేసి విన్నింగ్, రన్నరప్ జట్లను సత్కరించారు. ఈ సందర్భంగా జేఎన్‌టీయూ కాకినాడకు చెందిన స్పోర్ట్స్ కౌన్సిల్ కార్యదర్శి జి.శ్యామ్ కుమార్ మాట్లాడుతూ విద్యార్థులకు చదువుతోపాటు క్రీడలు కూడా అవసరమన్నారు. కార్యక్రమంలో ట్రెజరర్ కెవి స్వామి, పాలకవర్గ సభ్యులు అడ్డాల శ్రీహరి, ప్రిన్సిపాల్స్ సురేష్‌కుమార్, గోపీచంద్ తదితరులు పాల్గొన్నారు.

వాతావరణ మార్పులతో రైతుల బెంబేలు



అత్తిలి: ధాన్యం బస్తాలపై టార్పాలిన్‌లు కప్పుతున్న రైతులు



ఆకివీడు: ఆరబెట్టిన ధాన్యాన్ని పట్టుబడికి సిద్ధం చేస్తున్న రైతు కూలీలు

అత్తిలి/ఆకివీడు: వాతావరణం రైతులను భయపెడుతుంది. సార్వా పంట ప్రారంభం నుంచి పంటచేతి కందే సమయం వరకు వరదలు, తుఫాన్‌లు సంభవించడంతో రైతులకు అనేక కష్టనష్టాలను ఎదుర్కొన్నారు. మంగళవారం ఉదయం నుంచి మబ్బులతో మళ్లీ వాతావరణం చల్లబడి సాయంత్రం సమయంలో తుంపర్లతో కూడన చిరుజల్లులు కురియడంతో రైతులు ఉరుకులు, పరుగులు తీశారు. అత్తిలి మండలంలో 14 వేల ఎకరాలకు గాను 13 వేల ఎకరాలలో వరికోతలు పూర్తయ్యాయి. ఇటీవల నూర్పిడి చేసిన ధాన్యాన్ని కొంత మంది ఆరబెట్టగా, మరికొంత మంది రైతులు బస్తాలలో నింపి నెట్టికట్టి ఉంచారు. వాతావరణంలో మార్పులు సంభవించడంతో రోడ్ల వెంబడి కళ్లాల్లో ఉన్న ధాన్యాన్ని కాపాడుకునేందుకు ధాన్యం రాశులు, బస్తాలపై టార్పాలిన్‌లు కప్పారు. మండలంలో రోడ్ల వెంబడి ఉన్న ధాన్యం బస్తాలు, ధాన్యం రాశులు, నూర్పిడి చేయాల్సిన పంటతో కలిపి సుమారు 4 వేల టన్నుల ధాన్యం సేకరించాల్సి ఉందని వ్యవసాయ శాఖ అధికారి టీకే రాజేష్ చెబుతున్నారు.

నోరూరిస్తున్న ముంబై జామ



హాయ్ రే హాయ్... జాంపండురోయ్, ఏమి రూపురా! ఏమి రుచిరా! అంటూ హాయిగా పాట పాడుకుంటూ తినేసే విధంగా ఉంది ముంబై జామ పండు. గత రెండు రోజులుగా మార్కెట్‌లోకి ముంబై జామ రావడంతో గిరాకీ భారీగా పెరిగింది. పెద్ద సైజులో దొరగా కంటికి ఇంపుగా ఈ ముంబై జామ పండు ఉంది. ఈ జామకాయ ఒకొక్కటి రూ. 50ల పైబడి ఉంది. దేశవాళీ జామకాయలను జ్యూస్‌కు కంపెనీలకు తరలిస్తుండడంతో మార్కెట్‌కు రావడం తగ్గిపోయింది. అయితే కొన్నిరోజులుగా ముంబై జామ రావడంతో పెద్ద ఎత్తున ప్రజలు వీటిని కొనుగోలు చేసేందుకు ఉత్సాహం చూపుతున్నారు. – ఆకివీడు

పాలిటెక్నిక్ క్రీడలు ప్రారంభం

తాడేపల్లిగూడెం: జిల్లాలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలల రీజనల్ మీట్ 2024 పోటీలు మంగళవారం ప్రారంభమయ్యాయి. ఈ క్రీడా పోటీలను నిట్ రిజిస్ట్రార్ దినేష్ శంకర్‌రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా యాన మాట్లాడుతూ విద్యార్థులు క్రీడల్లో పాల్గొంటే చదువులో చురుగ్గా ఉంటారన్నారు. కబడ్డీ, వాలీబాల్ , బ్యాడ్మింటన్, చెస్, రన్నింగ్ పోటీలలో 11 మంది పాలిటెక్నిక్ కళాశాలల నుంచి సుమారు 474 మంది విద్యార్థులు పాల్గొన్నారు. 19 వరకు ఈ పోటీలు జరుగనున్నాయి.

జాతీయ స్థాయి పోటీల్లో ప్రతిభ



విద్యార్థులను అభినందిస్తున్న అధ్యాపక సిబ్బంది

తణుకు టౌన్: ఆదికవి నన్నయ్య యూనివర్సిటీ ఇంటర్ కాలేజీయేట్ అథ్లెటిక్ మీట్‌లో తణుకు శ్రీ చిట్టూరి ఇంద్రయ్య మెమోరియల్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులు ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలు సాధించినట్లు ప్రిన్సిపాల్ కేఆర్ ఫణిధర్ మంగళవారం విలేకరులకు తెలిపారు. ఈ పోటీల్లో తమ విద్యార్థులు 21కే మారథాన్, 10 కెఎం రన్నింగ్‌లో బి.సుబేష్ ప్రథమ స్థానం సాధించి రెండు విభాగాల్లో బంగారు పతకాలను సాధించినట్లు తెలిపారు. పి.ప్రవీణ్ కుమార్ డిస్కస్ త్రో, షార్ట్‌పుట్ విభాగాల్లో సిల్వర్ మెడల్ సాధించినట్లు తెలిపారు. టి.రత్నకుమార్ జావెలిన్ త్రోలో ద్వితీయ స్థానాన్ని సాధించినట్లు వివరించారు. విజేతలుగా నిలిచిన విద్యార్థులు ఈనెల 26 నుంచి భువనేశ్వర్‌లో జరిగే జాతీయ స్థాయి పోటీలలో పాల్గొనేందుకు అర్హత సాధించినట్లు తెలిపారు. అనపర్తిలో జరిగిన ఇంటర్ కాలేజీయేట్ బాల్ బాడ్మింటన్ పోటీలలో తమ కళాశాల విద్యార్థి హిమేష్ కుమార్ విజేతగా నిలిచి వచ్చే సంవత్సరం జనవరిలో బెంగుళూరులో జరిగే జాతీయస్థాయి పోటీలకు అర్హత సాధించినట్లు తెలిపారు. అనంతరం విద్యార్థులను కళాశాల పీడీ కె. వెంకన్నబాబు, భూపాల్, మారుతీదేవి చౌదరి తదితరులు అభినందించారు.

క్లుప్తంగా

26 మంది వృద్ధులకు ఉచిత వైద్యసేవలు



తణుకులో వైద్యసేవలందిస్తున్న దృశ్యం

తణుకు అర్బన్: సజ్జాపురం సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత వైద్యశిబిరానికి 26 మంది వృద్ధులు హాజరయ్యారు. స్థానిక రాష్ట్రపతి రోడ్డులోని అసోసియేషన్ కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన ఈ శిబిరంలో సీనియర్ వైద్యులు డాక్టర్ భూపతిరాజు రమేష్‌చంద్రబాబు వృద్ధులకు వైద్యసేవలు అందించి తీసుకోవాల్సిన ఆహార అలవాట్లు, వ్యాయామం, నడకపై అవగాహన కల్పించారు. హాజరైన వృద్ధులకు బీపీ, సుగర్ పరీక్షలు నిర్వహించి పేదలకు ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు అడ్డాల సత్యనారాయణ, తణుకు శాఖ అధ్యక్షుడు ఈదర ప్రసాదరావు, ఉపాధ్యక్షుడు ద్వారంపూడి బాబిరెడ్డి, కార్యదర్శి కోసూరి గాంధీ, సభ్యులు ఇవటూరి లక్ష్మణరావు, చేబ్రోలు సాధు పాల్గొన్నారు.

లయన్స్ సేవలు అభినందనీయం



సేవా కార్యక్రమంలో లయన్స్‌క్లబ్ సభ్యులు

తాడేపల్లిగూడెం (టీఓసీ): పర్యావరణ పరిరక్షణ, హంగర్ రిలీఫ్ కార్యక్రమాలలో భాగంగా లయన్స్‌క్లబ్ జిల్లా గవర్నర్ కాకరల వేణుబాబు ప్రోత్సాహంతో జీఎంఏ న్యూ క్లబ్స్ కో–ఆర్డినేటర్ పేరిచర్ల మురళీకృష్ణంరాజు ఆధ్వర్యంలో మంగళవారం వివిధ సేవా కార్యక్రమాలు జరిగాయి. లయన్స్‌క్లబ్ డైమండ్స్ అధ్యక్షుడు కొప్పిశెట్టి రమణయ్య ఆధ్వర్యంలో స్థానిక భవిత కేంద్రంలో విద్యార్థులకు బుక్స్, స్టేషనరీ అందజేశారు. దాత రాధిక కల్యాణం అందజేసిన ఆట వస్తువులు, ట్రెజరర్ కాళ్ళ గోపికృష్ణ సహకారంతో బిస్కెట్స్ పిల్లలకు అందజేశారు. భవిత కేంద్రం నిర్వాహకులు బాల ఈశ్వరయ్య, సహాయకురాలు నాగమణిలను సత్కరించారు. ఈ కార్యక్రమంలో చెన్నారెడ్డి సతీష్, కుందుం వెంకటేశ్వరరావు, యర్రా ఆంజనేయస్వామి, కె.సాయి సత్యనారాయణరాజు, స్కూల్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థినుల ప్రతిభ



విద్యార్థినులను అభినందిస్తున్న కళాశాల కరస్పాండెంట్, తదితరులు

తణుకు టౌన్: ఆది కవి నన్నయ్య యూనివర్సిటీ ఇంటర్ కాలేజియేట్ మహిళా అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్ పోటీలలో తణుకు మహిళా కళాశాలకు చెందిన విద్యార్థినులు విజేతలుగా నిలిచినట్లు ప్రిన్సిపల్ యూ లక్ష్మీసుందరి బాయి తెలిపారు. ఈనెల 13, 14 తేదీలలో రాజమండ్రిలో జరిగిన మహిళా అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్ పోటీలతో తమ కళాశాలకు చెందిన యూఎన్‌డీ భవాని హైజంప్, జావలిన్ త్రోలో ప్రథమ స్థానం, బీ నాగలక్ష్మీ దుర్గ 21కే రన్నింగ్‌లో తృతీయ స్థానం, కె వైశాలి హైజంప్‌లో తృతీయ స్థానాలు సాధించినట్లు తెలిపారు. ఈసందర్భంగా విద్యార్థినీలను కళాశాల కరస్పాండెంట్ చిట్టూరి సత్తయ ఉషా రాణి, పీడీ ఎం రత్నకుమారి, ఇతర అధ్యాపక సిబ్బంది అభినందించారు.

తాడువాయి ఆంధ్ర సుగర్స్ తాత్కాలిక మూసివేత

జంగారెడ్డిగూడెం రూరల్: జంగారెడ్డిగూడెం మండలం తాడువాయి ఆంధ్రా షుగర్స్ లిమిటెడ్ కర్మాగారాన్ని తాత్కాలికంగా మూసివేస్తున్నట్లు వైస్ ప్రెసిడెంట్ పీవీఎస్ విశ్వనాథ కుమార్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఫ్యాక్టరీ కెపాసిటీకి సరిపడ చెరుకు లేనందున 2025–26 సీజన్‌కు చెరుకు క్రషింగ్‌ను తాత్కాలికంగా నిలిపివేస్తున్నట్లు చెప్పారు.

అత్తిలి డిస్ట్రిబ్యూటరీ కమిటీ చైర్మన్‌గా నల్లూరి సురేష్‌కుమార్

అత్తిలి: డిస్ట్రిబ్యూటరీ కమిటీ అధ్యక్ష, ఉపాధ్యక్ష ఎన్నిక మంగళవారం ప్రశాంతంగా జరిగింది. డిస్ట్రిబ్యూటరీ కమిటీ చైర్మన్‌గా నల్లూరి సురేష్‌కుమార్, వైస్ చైర్మన్–1గా గాదిరాజు వెంకటకృష్ణ సత్యనారాయణరాజు, డీసీ వైస్ చైర్మన్‌గా 2గా కొత్తపల్లి వెంకట సత్య నారాయణరాజు ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ఇరిగేషన్‌శాఖ అధికారులు తెలిపారు. కార్యక్రమంలో సాగునీటి సంఘాల అధ్యక్షులు దారాబత్తుల జయరాజు, పెన్మెత్స పుల్లంరాజు, టీడీపీ మండలాధ్యక్షుడు ఆనాల ఆదినారాయణ, అత్తిలి టౌన్ అధ్యక్షుడు పూతినీడి శ్రీనివాస్, మాజీ ఎంపీపీలు కేతా సత్యనారాయణ, మక్కా సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ముమ్మరంగా దాళ్వా సాగు పనులు



అత్తిలి మండలం వరిఘేడులో సిద్ధమైన నారుమడులు



అత్తిలి మండలం తిరుపతిపురంలో ధాన్యాన్ని ఆరబెడుతున్న రైతులు

- వ్యవసాయ పనులలో నిమగ్నమైన రైతాంగం
- ఒక పక్క సార్వా మాసూళ్లు, మరోపక్క దాళ్వా నారుమడులు ఏర్పాటు

అత్తిలి: మండలంలో ఒక పక్క సార్వా మాసూళ్లు, మరోపక్క దాళ్వా సాగుకు నారుమడులు సిద్ధం చేసుకునే పనిలో రైతాంగం నిమగ్నమైంది. పంటచేతికందే సమయానికి ప్రతికూల వాతావరణ పరిస్థితులు నెలకొనడంతో సార్వా మాసూళ్ల ఆలస్యమయ్యాయి. దీంతో ముందే వరికోతలు పూర్తైన గ్రామాలలో దాళ్వానారుమడులు పోస్తుండగా, మరికొన్ని గ్రామాలలో సార్వా మాసూళ్ల జరుగుతున్నాయి. అత్తిలి మండలంలో 14 వేల ఎకరాలలో వరిసాగు చేస్తున్నారు. మండలంలో ఇప్పటి వరకు 80 శాతం మేర వరికోతలు పూర్తైతయ్యాయి.

ఆరోగ్యవంతమైన నారుపెంచడానికి ఇవి పాటించాలి

దాళ్వాసాగులో ఎంటీయూ 1121, ఎంటీయూ 3626, ఎంటీయూ 1153, ఎంటీయూ 1156, పీఆర్ 126 రకాలను సాగు చేసుకోవచ్చని మండల వ్యవసాయశాఖ అధికారి టీకే రాజేష్ చెప్పారు. నారుమడిని 10–12 రోజుల వ్యవధిలో 3 దఫాలుగా దమ్ము చేసి చదునుచేసి, నీరు పెట్టడానికి, తీయడానికి వీలుగా కాలువలను ఏర్పాటుచేసుకోవాలి. 5సెంట్ల నారుమడికి 2 కిలోల నత్రజని, కిలో భాస్వరం, కిలో పొటాష్‌నిచ్చే ఎరువులను ఉక్కిలో వేయాలి. చలి ఎక్కువగాఉండే ప్రాంతాలలో రబీ కాలంలో భాస్వరంను రెట్టింపు వేయాలి. శిలీంద్రనాశినితో శుద్ధిచేసి మొలక కట్టిన విత్తనాన్ని సెంటుకు 5 కిలోల చొప్పున చల్లుకోవాలి. నారు ఒక ఆకు పూర్తిగా పురివిచ్చుకునే వరకు ఆరుతడిగా నీరు ఇచ్చి తర్వాత పలుచగా నీరు నిల్వకట్టాలి. జింకు లోపాన్ని గమనిస్తే లీటరు నీటికి 2 గ్రాముల జింకు సల్ఫేట్ ద్రావణాన్ని పిచికారి చేయాలి. విత్తిన 10 రోజులకు కార్బోఫ్యూరాన్ 3 జీ గుళికలు సెంటు నారుమడికి 160గ్రాముల చొప్పున వేయాలి. మండె కట్టిన తర్వాత ముక్కు పగిలిన విత్తనాలను నారుమడిలో సమానంతగా పలుచటి నీటి పొర ఉంచి విత్తుకోవాలి. మరుసటి రోజు నారుమడిలో నీటిని మొత్తం తీసివేయాలి.

విత్తనశుద్ధి

కిలోవిత్తనానికి మూడు గ్రాముల కార్బెండిజమ్ 50 శాతం మందును కలిపి 24 గంటల తరువాత నారుమడిలో చల్లుకోవాలి. కోత కోసిన వెంటనే విత్తనాలను వాడుకోవాలంటే వరిగింజల్లో నిద్రావస్థను తొలగించి అధిక మొలకశాతం రాబట్టడానికి లీటరు నీటికి తక్కువ నిద్రావస్థ ఉన్న విత్తనాలకు 6.3మిల్లీగ్రాములు లేదా విజేత లాంటి ఎక్కువ నిద్రావస్థ ఉన్న విత్తనాలకు 10 మిల్లీ గ్రాముల గాఢ నత్రికామ్లం కలిపి ఆద్రావణంలో 24 గంటలు నానబెట్టి మరో 24 గంటలు మండె కట్టాలని మండల వ్యవసాయశాఖ అధికారి టీకే రాజేష్ తెలిపారు.

లార్వా జనిత ప్రదేశాలు లేకుండా చేద్దాం



ఏరియా ఆసుపత్రిలో మాట్లాడుతున్న జిల్లా మలేరియా అధికారి డాక్టర్ గులాబ్ రాజ్ కుమార్

తాడేపల్లిగూడెం (టీఓసీ): లార్వా జనిత ప్రదేశాలను లేకుండా చేద్దామని, దోమ రహిత సమాజ స్థాపనకు కృషి చేద్దామని జిల్లా మలేరియా అధికారి డాక్టర్ గులాబ్ రాజ్ కుమార్ పిలుపునిచ్చారు. ప్రాంతీయ ఆసుపత్రిని మంగళవారం పరిశీలించారు. సూపరింటెండెంట్ డాక్టర్ ఏవీఆర్ఎస్ తాతారావుతో కలిసి ప్రసూతి, మేల్ వార్డులను పరిశీలించారు. పారిశుద్ధ్య పర్యవేక్షకులతో కలిసి ఆసుపత్రి ప్రాంగణంలోని డ్రైయినేజీలను పరిశీలించారు. సబ్ యూనిట్ అధికారి వై.వి.లక్ష్మణరావు, మాట్లాడుతూ కీటక నియంత్రణ చర్యలు రోజువారి చేయాలని తెలిపారు. పట్టణ ఆరోగ్య కేంద్రాల వైద్యాధికారులతో కంట్రోల్ హైజీన్ కార్యక్రమాలు అమలుపై సమీక్ష చేశారు. వైద్యాధికారులు డాక్టర్ కేఎస్ రవి కుమార్, డాక్టర్ తనూజా, డాక్టర్ శ్రావ్యలకు సూచనలు చేశారు. కార్యక్రమంలో ఆరోగ్య పర్యవేక్షకురాలు మంగతాయరు, పద్మ, లాబ్ టెక్నీషియన్స్ ఎం.ఆదాం, పృథ్వీ, శంకర్ పాల్గొన్నారు.

భూసమస్యల పరిష్కారానికే రెవెన్యూ సదస్సులు

తాడేపల్లిగూడెం రూరల్ : భూసమస్యల పరిష్కారానికి రాష్ట్ర ప్రభుత్వం రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తుందని తహసీల్దార్ ఎం.సునీల్‌కుమార్ అన్నారు. మంగళవారం మండలంలోని ఆరుగొలను, దండగర్ర, లింగారాయుడిగూడెం గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆరుగొలను సదస్సులో తహసీల్దార్ సునీల్‌కుమార్ మాట్లాడుతూ భూమి రికార్డులు, ఆన్‌లైన్‌లో తప్పులు సరి చేసుకోవడానికి రెవెన్యూ సదస్సుల్లో అర్జీలు అందజేయాలన్నారు. వాటిని 30 రోజుల్లో పరిష్కరిస్తామన్నారు. అలాగే ఆదాయం, కుల తదితర ధ్రువీకరణ పత్రాలను ఎటువంటి రుసుము లేకుండా ఈ సదస్సుల్లో ఉచితంగా అందించనున్నట్టు తెలిపారు. కొత్త రేషన్ కార్డుల జారీపై వస్తున్న ప్రచారాన్ని ఆయన ఖండించారు. రేషన్ కార్డులు, ఇళ్ల స్థలాల కోసం దరఖాస్తు చేసుకున్న వారికి ప్రభుత్వం నుంచి ఆదేశాలు రాగానే అందిస్తామన్నారు. ప్రజలు ఈ రెవెన్యూ సదస్సులను వినియోగించుకోవాలన్నారు. అనంతరం ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. గ్రామ సర్పంచ్ పీతల బుచ్చిబాబు, ఉప సర్పంచ్ అప్పలరాజు, నీటి సంఘం అధ్యక్షుడు సత్తిబాబు, వీఆర్వో దివ్య, పంచాయతీ ఈవో రవిచంద్ర, దేవాదాయ శాఖ సిబ్బంది అబ్బులు తదితరులు పాల్గొన్నారు.



తాడేపల్లిగూడెం రూరల్: ఆరుగొలను రెవెన్యూ సదస్సులో మాట్లాడుతున్న తహసీల్దార్ సునీల్ కుమార్



అత్తిలి: రెవెన్యూ సదస్సులో ప్రజల నుంచి వినతులను స్వీకరిస్తున్న జేసీ రాహుల్‌కుమార్‌రెడ్డి

రెవెన్యూ సదస్సులో 23 అర్జీలు

తణుకు టౌన్: మండలం వేల్పూరు గ్రామంలో నిర్వహించిన రెవెన్యూ సదస్సులో మొత్తం 23 దరఖాస్తులు అందినట్లు తహసీల్దార్ డీవీఎస్ఎస్ అశోక్ వర్మ తెలిపారు. మంగళవారం వేల్పూరు గ్రామ పంచాయితీ కార్యాలయం వద్ద నిర్వహించిన రెవెన్యూ సదస్సులో భూ సమస్యల పరిష్కారం కోసం రైతులు, భూ యజమానుల నుంచి 23 అర్జీలు వచ్చాయన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ విశ్వనాథం కృష్ణవేణి, గ్రామ కార్యదర్శి, రెవెన్యూ, దేవాదాయ శాఖ అధికారులు పాల్గొన్నారు.

రెవెన్యూ సదస్సులను సద్వినియోగం చేసుకోవాలి– జేసీ

అత్తిలి: భూసమస్యలు పరిష్కారమే ధ్యేయంగా రెవెన్యూ సదస్సులు నిర్వహించడం జరుగుతోందని జిల్లా జాయింట్ కలెక్టర్ టి రాహుల్‌కుమార్ రెడ్డి చెప్పారు. మంగళవారం అత్తిలి గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద ఆర్డీవో ఖతీబ్ కౌసర్ భానో అధ్యక్షతన జరిగిన రెవెన్యూసదస్సుకు జిల్లా జాయింట్ కలెక్టర్ టి రాహుల్‌కుమార్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈసదస్సులో పలువురు రైతులు నుంచి భూ సమస్యలు, పాస్‌బుక్ సమస్యలు, రీ సర్వే మ్యుటేషన్‌లకు సంబంధించిన అంశాలపై పలువురు రైతుల నుంచి 45 దరఖాస్తులను జిల్లా జాయింట్ కలెక్టర్ టి రాహుల్‌కుమార్ రెడ్డి స్వయంగా స్వీకరించారు. ఈ సందర్భంగా జరిగిన సభలో రైతులు ఎదుర్కొంటున్న భూ సమస్యల పరిష్కారం కోసం గ్రామాల వారీగా రెవెన్యూ సదస్సులను నిర్వహిస్తున్నామన్నారు. రైతులు సందేహాలను సదస్సుల ద్వారా సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో తాడేపల్లిగూడెం ఆర్డీవో ఖతీబ్ కౌసర్‌భానో, సర్పంచ్ గంటావిజేత, తహసీల్దార్ దశికవంశీ, స్థానిక నాయకులు పూతినీడి శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఘనంగా జాతీయ పెన్షనర్స్ డే

తాడేపల్లిగూడెం (టీఓసీ): జాతీయ పెన్షనర్స్‌డేను మంగళవారం స్థానిక పెన్షనర్స్ కార్యాలయంలో యూనిట్ అధ్యక్షుడు బి.హరికుమార్ అధ్యక్షతన ఘనంగా నిర్వహించారు. సీనియర్ సిటిజన్స్ ఏపీ వెల్ఫేర్ రాష్ట్ర అధ్యక్షుడు వెంపరాల నారాయణ మూర్తి, సబ్ ట్రెజరీ ఆఫీసర్ పి.జయదత్తేశ్వరరావు, మునిసిపల్ కమిషనర్ యం.ఏసుబాబులు మాట్లాడుతూ పెన్షనర్స్ జీవితంలో వెలుగులు నింపిన ఆరాధ్యుడు డీఎస్ నకారా అని కొనియాడారు. పెన్షనర్స్ తమ లైఫ్ సర్టిఫికెట్స్‌ను జనవరి నుంచి అందించాలని కోరారు. పెన్షనర్స్ ఆయా సమస్యల పరిష్కారానికి తమవంతుగా కృషి చేస్తామన్నారు. వైఎస్‌వీ గోపాలరావు, వి.సత్యనారాయణ, కనక సుందరరావు, ప్రత్తి వీరాస్వామి, చలపతిరావు, గరికపాటి సుబ్రహ్మణ్య శర్మ, అర్జునరావు, విజయలక్ష్మి, గురజాడ బ్రహ్మాజీ, ఎ.వి.కృష్ణారావులులు పర్యవేక్షించారు. సీనియర్ సంఘ సభ్యులకు, జర్నలిస్టు యద్దనపూడి సుబ్బారావుకు, కళాకారులు కోపల్లె శ్రీనివాస్‌లకు చిరు సత్కారాలు జరిగాయి.



సీనియర్ సిటిజన్స్ ఏపీ వెల్ఫేర్ రాష్ట్ర అధ్యక్షుడు వెంపరాల నారాయణ మూర్తిని సత్కరిస్తున్న దృశ్యం

సుస్థిర అభివృద్ధి సాధించాలి



ఇరగవరం: శిక్షణకు హాజరైన ప్రజాప్రతినిధులు, అధికారులు



అత్తిలి: శిక్షణలో మాట్లాడుతున్న ఎంపీడీవో శామ్యూల్

ఇరగవరం: గ్రామాల్లో సుస్థిర అభివృద్ధి సాధించే దిశగా గ్రామ పంచాయతీలు పనిచేయాలని ఎంపీడీఓ శ్రీనివాస్ తెలిపారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయం వద్ద సుస్థిర అభివృద్ధి లక్ష్యాలపై నిర్వహించిన కార్యక్రమంలో శిక్షణలో ఎంపీడీఓ మాట్లాడారు. గ్రామాల్లో సుస్థిర అభివృద్ధి సాధించేందుకు అన్ని ప్రభుత్వ శాఖలతో సమన్వయం కోసం వివిధ శిక్షణలు క్షేత్రస్థాయిలో నిర్వహిస్తున్నట్టు చెప్పారు.ఈ కార్యక్రమంలో జిల్లా లింక్ ఆఫీసర్ ఎం.చక్రపాణిరావు, విస్తరణాధికారి పీవీఎస్ నరసింహమూర్తి, ఇరగవరం మండలంలోని మండల స్థాయి అధికారులు, బ్యాచ్ -2 గ్రామ సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు, గ్రామ సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.

లక్ష్యాలపై శిక్షణ

అత్తిలి: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మండలస్థాయి అధికారులు, సచివాలయ సిబ్బందికి మంగళవారం సుస్థిర అభివృద్ధి లక్ష్యాలపై 2వ బ్యాచ్ మొదటి రోజు శిక్షణ కార్యక్రమాన్ని ఎంపీడీవో పి శామ్యూల్ ప్రారంభించారు. గ్రామ పంచాయతీల అభివృద్ధికి తీసుకోవాల్సిన చర్యలు, 9 థీమ్స్ లక్ష్యాలు, ప్రజారోగ్య లక్ష్యాలపై శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో ఈవోఆర్డీ ఎం శ్రీనివాస రావు, మండలస్థాయి అధికారులు పాల్గొన్నారు.

పంటల బీమాకు అర్జీలు చేసుకోండి

తాడేపల్లిగూడెం రూరల్: దాళ్వా సీజన్‌కు సంబంధించి ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన పథకానికి రైతులు, కౌలు రైతులు ఈ నెల 31వ తేది లోపు దరఖాస్తు చేసుకోవాలని మండల వ్యవసాయాధికారి ఆర్ఎస్.ప్రసాద్ సూచించారు. మంగళవారం తాడేపల్లిగూడెంలో ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. బ్యాంకుల నుంచి రుణం పొందని రైతులు కామన్ సర్వీస సెంటర్లు, మీ–సేవ కేంద్రాలు, సచివాలయాల్లోని డిజిటల్ అసిస్టెంట్లను సంప్రదించి దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఎకరానికి రూ.615లు ప్రీమియం చెల్లించి పంటల బీమా చేయించుకోవాలన్నారు. రుణాలు పొందని రైతులు పట్టాదారు పాస్ పుస్తకం, ఆధార్ కార్డు, పంట ధృవీకరణ, బ్యాంకు అకౌంట్ తీసుకెళ్లాలన్నారు. కౌలు రైతులు కౌలు కార్డు, పంట ధృవీకరణ పత్రాలతో పేర్లు నమోదు చేసుకోవాలన్నారు. అగ్రికల్చర్ ఇన్సూరెన్స్ కంపెనీ ఆధ్వర్యంలో ఫసల్ బీమా నమోదు జరుగుతుందన్నారు. గత దాళ్వాసీజన్‌లో సంభవించిన ప్రకృతి వైపరీత్యాలను దృష్టిలో ఉంచుకుని జిల్లాలో ఈ పథకాన్ని ప్రభుత్వం అమలు చేస్తుందన్నారు. రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.



ఆర్ఎస్.ప్రసాద్

ఇంధన పొదుపు మనందరి బాధ్యత

తాడేపల్లిగూడెం (టీఓసీ): విద్యుత్ వారోత్సవాలు సందర్భంగా జువ్వలపాలెం శివారు ఏపీఈపీడీసీఎల్ తాడేపల్లిగూడెం డివిజన్ కార్యాలయం వద్ద మంగళవారం ఈఈ నరసింహరావు పర్యవేక్షణలో ఇంధన పొదుపు ప్రతిజ్ఞ చేయించారు. జిల్లా సూపరింటెండెంట్ ఇంజనీర్ కె.నరసింహమూర్తి హాజరై ప్రతిజ్ఞ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా నరసింహమూర్తి మాట్లాడుతూ వారోత్సవాలు ఈ నెల 20 వరకు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. విద్యుత్ పొదుపు చేయాలని, ప్రతి ఒక్కరు బాధ్యత అన్నారు. విద్యుత్‌ను పొదుపు చేస్తే ఉత్పత్తి చేసినట్లు అని చెప్పారు. ఆదా చేయడం ద్వారా ప్రకృతి సంపదను కాపాడినట్లు అవుతుందన్నారు. విద్యుత్‌ను ఆదా చేయడం ద్వారా పర్యావరణాన్ని కాపాడవచ్చునని, భవిష్యత్తు తరాలకు ఎంతో ఉపయుక్తమని నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో డివిజన్‌లోని ఏడీఈలు, ఏఈలు, విద్యుత్ సిబ్బంది, అకౌంట్స్ సెక్షన్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



ప్రతిజ్ఞ చేస్తున్న విద్యుత్ అధికారులు సిబ్బంది

ఆర్థిక సహాయం అందజేత



దివ్యాంగ క్రీడాకారులకు ఆర్థిక సహాయం అందజేస్తున్న ఎమ్మెల్యే రాధాకృష్ణ

తణుకు టౌన్: దివ్యాంగులు క్రీడల్లో రాణించి ఉన్నతంగా ఎదగాలని ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ తెలిపారు. కాకినాడలో ఏపీ దివ్యాంగ (చెవిటి) క్రీడా ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఈనెల 18, 19 తేదీలలో జరిగే టోర్నమెంట్‌లో పాల్గొనే జిల్లా దివ్యాంగుల (చెవిటి) క్రీడాకారులకు మంగళవారం ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ రూ. 24వేల ఆర్థిక సహాయాన్ని అందజేశారు. దివ్యాంగుల ప్రతిభను గుర్తించి, మెరుగుపర్చుకునేందుకు అవసరమైన సహాయ సహకారాలు అందిస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో నాయకులు పాల్గొన్నారు.

పేకాట శిబిరంపై దాడి

అత్తిలి: మండలంలో పేకాట ఆడుతున్న ఇద్దరు వ్యక్తులను అరెస్టు చేసినట్లు ఎస్ఐ పి ప్రేమరాజు తెలిపారు. మంగళవారం అత్తిలి మండలం స్కిన్నెరపురం గ్రామ శివారు పొలాల్లో పేకాట ఆడుతున్నారన్న సమాచారం మేరకు సిబ్బందితో దాడిచేయగా ఇద్దరు వ్యక్తులను అదుపులోకి తీసుకుని వారివద్ద నుంచి రూ. 3 వేల నగదును స్వాధీనం చేసుకున్నామని ఎస్ఐ తెలిపారు.

విజిలెన్సు సోదాలు



పరిశీలన చేస్తున్న విజిలెన్సు, మునిసిపల్ అధికారులు

తాడేపల్లిగూడెం: గూడెం మునిసిపాలిటీలో టీడీఆర్ బాండ్ల జారీ వ్యవహారానికి సంబంధించి విజిలెన్సు అధికారులు మంగళవారం క్షేత్రసాస్థాయి పరిశీలన చేశారు. ఏఏ వ్యక్తులకు ఈ బాండ్లు జారీ చేశారు. వారి భవనాలు, వారి స్థలాల వద్ద సెట్ బ్యాక్‌లు, నిర్మాణాలు, రికార్డులలో వాటి స్థితిగతులు తదితర విషయాలను మునిసిపల్ కమిషనర్ ఎం.ఏసుబాబు, సిబ్బందిని వెంట పెట్టుకొని కె ఎన్‌రోడ్డులో చూశారు. భూమి కొలతలు వేసి, రికార్డుల ప్రకారం ఉన్న కొలతలు నిర్ధారణ చేసుకున్నారు. ఈ దాడుల్లో విజిలెన్సు ఎస్పీ శ్రీరామ్ ఉన్నారు.

బెల్ట్ షాపు నిర్వాహకుడి అరెస్టు



బెల్ట్ షాపు నిర్వాహకుడిని అదుపులోకి తీసుకున్న ఎక్సైజ్ అధికారులు

తాడేపల్లిగూడెం రూరల్: బెల్ట్ షాపు నిర్వహిస్తున్న వ్యక్తిని అదుపులోకి తీసుకున్నట్లు ఎక్సైజ్ సీఐ స్వరాజ్యలక్ష్మి మంగళవారం తెలిపారు. తాడేపల్లిగూడెం ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో పలు చోట్ల తనిఖీలు నిర్వహించామన్నా రు. ఈ క్రమంలో కొమ్ముగూడెం గ్రా మంలో బెల్ట్ షాపు నిర్వహిస్తున్న వ్యక్తిని అదుపులోకి తీసుకొని అతని వద్ద నుంచి ఆరు డ్యూటీ పెయిడ్ మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నట్లు వివరించారు. ఈ తనిఖీల్లో ఎస్ఐ మురళీ మోహన్, సిబ్బంది పాల్గొన్నట్లు తెలిపారు.

నిప్పుతో ముప్పు

- పంట వ్యర్థాలను కాల్చితే భూమికి నష్టం
- భూసారాన్ని దెబ్బతీస్తున్న రైతుల ఆలోచనలు
- యంత్రాలతో కోత జరిగిన చోటే ఇలాంటి పరిస్థితి
- పొలంలో కలియదున్నితే మేలు

ఇరగవరం : ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌లో వరి పంట పండింది. నెల రోజులుగా యంత్రాల ద్వారా కోత లు, నూర్పిడి ముమ్మరంగా జరుగుతున్నాయి. అదే పొలంలో రబీలో మరోపంట వేసేందుకు పొలాన్ని దుక్కి దమ్ము చేసేందుకు పంట వ్యర్థాలు అడ్డంకిగా నిలుస్తున్నాయి. రైతులు వరి చేను వ్యర్థాల(గడ్డి)కి పొలాల్లోనే నిప్పు పెడుతున్నారు. రైతులు తీసుకుంటున్న ఈ నిర్ణయం కారణంగా వారికి తెలియకుండానే భూసారాన్ని నాశనం చేస్తున్నారు.

యంత్రాలతో కోతలు జరిగిన పొలంలోనే..

నియోజకవర్గంలోని నాలుగు మండలాల్లోనూ వరి చేనులో కోతలు కోసిన రైతులు పంటల వ్యర్థాలకు నిప్పు పెడుతున్నారు. యంత్రాల ద్వారా వరిచేను కోత కోసిన సమయంలో పొలంలో ఎక్కువ ఎత్తులో కోత చేస్తారు. కోసిన తర్వాత ధాన్యం ఇంటికి చేరుకోగా ..పంట వ్యర్థాలు(గడ్డి) పొలం నిండా పరుచుకుంటుంది. రబీలో పంట వేయాలంటే దుక్కి, దమ్ము చేసేందుకు వ్యర్థాలు(గడ్డి) లేకుండా చేయాలి. ఆ గడ్డిని ఒకచోటకు చేర్చి కుప్ప పెట్టాలంటే రైతులకు అదనపు ఖర్చుతో కూడిన పని అవుతుంది. గడ్డికి నిప్పు పెట్టిన తర్వాత రబీ పంటను వేసుకుంటున్నారు.



వరిచేలను తగలబెట్టిన దృశ్యం

మిత్ర పురుగులకు హాని

రైతులు తీసుకుంటున్న నిర్ణయం కారణంగా రైతులకు మేలు చేసే మిత్ర పురుగులు క్షీణిస్తున్నాయని వ్యవసాయశాఖ అధికారులు, వ్యవసాయ శాస్త్రవేత్తలు హెచ్చరిస్తున్నారు. పొలంలో పరుచుకున్న గడ్డిని కాల్చడం వలన భూమి పైపొరల్లో ఉండే మిత్ర పురుగులు వేడికి నాశనం అవుతున్నాయి. భూమిలో ఉండే వానపాములు, ఇతర సిలీంద్రాలు అంతరించి పోవడం వలన భూమికి నష్టం జరుగుతుందని తెలియజేస్తున్నారు.

మరో పంటకు ఇబ్బంది లేకుండా

వరిచేను యంత్రాలతో కోత కోసిన అనంతరం పొలంలో గడ్డి ఉండిపోతుంది. గడ్డి మట్టిలో కలిసేందుకు ఎక్కువ సమయం పడుతుంది. మరోపంట వేసుకునేందుకు ఇబ్బందిగా ఉన్నందున గడ్డిని కాల్చేస్తున్నాం. తరువాత పొలాన్ని దుక్కి, దమ్ము చేసి రెండో పంట వేసుకుంటున్నాం.

– సత్యనారాయణ, ఇరగవరం రైతు

అవగాహన కల్పిస్తున్నాం

పొలంలో పంటల వ్యర్థాలకు నిప్పు పెట్ట డంవలన భూమి పొరల్లో ఉన్న సీలీంద్రాలు ఇతర సూక్ష్మజీవులు, మిత్ర పురు గులు నశించిపోతాయి. యంత్రాలతో కోత కోసినతరువాత వ్యర్థాలను ఒక చోట చేర్చి అవి కుళ్లేలా చేయడంవలన సేంద్రీయ ఎరువు తయారవుతుంది. ఆ ఎరువును పొలానికి వాడుకోవచ్చు. వ్యర్థాలకు నిప్పు పెట్టకుండా ఉండాలని రైతులకు అవగాహన కల్పిస్తున్నాం.

– వై.రాఘవేంద్ర, ఇరగవరం ఏఓ